సాక్షి
కుమురం భీం

శుక్రవారం, 19, జూలై, 2024



సరిహద్దున హైఅలర్ట్
సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌తో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. సమాచారం లేకుండా సరిహద్దు ప్రాంతాలకు ప్రజాప్రతినిధులు వెళ్లవద్దని సూచించారు. 8లో▸



బీటీ ఉన్నా బస్సుల్లేవ్!
మారుమూల గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్సు సేవలు అందడం లేదు. రోడ్డు సౌకర్యం ఉన్నా యాజమాన్యం బస్సులు నడపడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
29.5 /25.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో చాలాప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వం అందిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయ నిర్మల

పెంచికల్‌పేట్(సిర్పూర్): ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయ నిర్మల అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 317 ఉద్యోగులను తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, ప్రమోషన్‌లో మిగిలిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ వి.వాసుదేవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. బట్టలు ఆరవేసేందుకు జీఐ, ఇతర విద్యుత్ సరఫరా కాని ప్లాస్టిక్ వైర్లు ఉపయోగించాలన్నారు. విద్యుత్ తీగలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇనుప వస్తువులు, రేకులకు తగలకుండా చూడాలన్నారు. చార్జింగ్ పెట్టి సెల్‌ఫోన్ ఉపయోగించొద్దని సూచించారు. కొన్నిచోట్ల వన్యప్రాణుల నుంచి పంట రక్షణ కోసం విద్యుత్ ఫెన్సింగ్ అమర్చుతున్నారని, ఇది చట్టరీత్యా నేరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు సమస్యలు ఉంటే అధికారులు, సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యేకు ఐకేపీ వీవోఏల వినతి



వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

కాగజ్‌నగర్‌రూరల్: తమ సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ గురువారం పట్టణంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు ఐకేపీ వీవోఏలు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాలు వీవోఏల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలన్నారు. ప్రతీ గ్రామ సంఘానికి ల్యాప్‌టాప్, ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించాలని, వీవోఏలు మూడు నెలల రెన్యూవల్ పద్ధతిని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కారంపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకరావాలని విన్నవించారు. కార్యక్రమంలో ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అంకయ్య, ధన్‌రాజ్, శ్రీనివాస్, అనిల్‌కుమార్, అనిత, తిరుపతి, సతీశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న డీడీ రమాదేవి

కెరమెరి(ఆసిఫాబాద్): వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా విద్యార్థులు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని గిరిజన సంక్షేమశాఖ డీడీ పి.రమాదేవి అన్నారు. మండలంలోని మోడి, అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ స్నానం చేయాలని, ఉతికిన దుస్తులు ధరించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. మోడి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెచ్ఎం స్వర్ణలత, హెచ్‌డబ్ల్యూవో వసంత్‌రావు తదితరులు ఉన్నారు.

రుణ విముక్తి

- జిల్లాలో మొదటివిడత రుణమాఫీలో 21,038 కుటుంబాలకు లబ్ధి
- 22 వేల మందికి సంబంధించి రూ.125.20 కోట్ల రుణాలు మాఫీ
- జిల్లాలోని రైతువేదికల్లో సంబురాలు
- రైతు సంక్షేమం దిశగా 'రుణమాఫీ' అమలు : కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు, రైతులు

ఆసిఫాబాద్‌అర్బన్: వ్యవసాయ రుణాల నుంచి రైతులకు విముక్తి కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ– 2024 కింద జిల్లాలో తొలివిడతలో రూ.125.20 కోట్ల రుణాలు మాఫీ చేసింది. 21,038 కుటుంబాలు లబ్ధి పొందాయి. మరో రెండు విడతల్లో రూ.రెండు లక్షల రుణాలు మాఫీ చేయనున్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ సురేందర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇతర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో కలిసి రైతు రుణమాఫీ పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో నేరుగా మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదికలో ద్వారా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బ్యాంకుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన రైతులకు రుణమాఫీ వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పథకం అమలు కోసం ప్రత్యేక పోర్టల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రుణమాఫీ కార్యక్రమంలో ఎమ్మెల్యే 'పాల్వాయి'

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండలం బాలాజీ అనుకోడ గ్రామంలో గురువారం నిర్వహించిన రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు. ముందుగా నూతన వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను ప్రారంభించారు. సాయంత్రం 4గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం కాగా అధికారులు, రైతులతో కలిసి ఆయన ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. ఎంపీడీవో కోటప్రసాద్, ఆర్ఐ జాఫర్, ఏవో రామకృష్ణ, ఏఈవోలు శ్రీలత, హెప్సిబా, కృపామణి, వెంకటేశ్, విజయ్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

రుణ ఖాతాలు పరిశీలించి మాఫీ అమలు చేస్తామని పేర్కొన్నారు. 15 మండలాల పరిధిలో 22 వేల మంది రైతులు మొదటి విడతలో లబ్ధి పొందినట్లు తెలిపారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రైతువేదిక ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, మండల వ్యవసాయాధికారి ఖాదర్ హుస్సేన్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రుణమాఫీ అమలు చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. గతంలో బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాన్ని త్వరగా మాఫీ చేయకపోవడంతో ఏటా వడ్డీ చెల్లించాల్సి వచ్చేది. రుణమాఫీతో వడ్డీ భారం తగ్గింది.
– రమేశ్, రైతు, గోవింద్‌పూర్

చరిత్రాత్మక నిర్ణయం



రైతులకు అండగా నిలవాలనే సంకల్పంతో రుణ విముక్తి కలిగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం. ఒకేసారి రూ.లక్ష రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు.
– సోయం లచ్చు, రైతు, కాపిరి

సంతోషంగా ఉంది



గత సంవత్సరం రూ.60 వేలు బ్యాంకు ద్వారా పెట్టుబడి కోసం రుణం తీసుకొన్నా. ప్రస్తుతం ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో వానాకాలం సీజన్‌కు పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడుతుంది. చాలా సంతోషంగా ఉంది.
– నరిగె మల్లమ్మ, జన్కాపూర్

పెట్టుబడి సాయమందించాలి



నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏడు నెలల వ్యవధిలో ఏకకాలంలో రుణమాఫీ ప్రకటించడం సరైన నిర్ణయం. అలాగే రైతులకు సకాలంలో రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించాలి.
– రామారావు, రైతు, గాడిజనగాం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు

- జిల్లా కేంద్రంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రూ.లక్ష రుణమాఫీ నగదు జమ చేసిన సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతువేదిక వద్ద సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రూప్‌నర్ రమేశ్, చరణ్, మల్లేశ్, కళావతి, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రభుత్వం



రాష్ట్రంలో రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచించే రైతు ప్రభుత్వం కొనసాగుతుండడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం రుణమాఫీ చేయడంతో వ్యవసాయదారులకు పెట్టుబడి ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
– వైరాగడె మారుతిపటేల్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు

షరతులు లేకుండా మాఫీ నగదు అందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకర్లు రుణమాఫీ నగదు రైతులకు అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రావూరి శ్రీనివాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్ జోషితో కలిసి గురువారం బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1.35 లక్షల మంది రైతు రుణమాఫీకి అర్హత కలిగి ఉన్నారని, తొలివిడతలో రూ.లక్ష లోపు రుణమాఫీ పొందే రైతులు 22 వేల మంది ఉన్నారని తెలిపారు. గురువారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా రుణమాఫీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు ఇతర రుణాలతో సంబంధం లేకుండా జిల్లా వ్యవసాయ శాఖతో సమన్వయంతో చేసుకుంటూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మాఫీ నగదు అందించాలన్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో అధిక మొత్తంలో ఖాతాలు ఉన్నాయన్నారు. రైతుల సౌకర్యార్థం కౌంటర్లతోపాటు సందేహాలు, ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతు సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీ పథకాన్ని జిల్లాలో ఎలాంటి అంతరాయం లేకుండా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

మూడో ప్లాట్‌ఫాంపై టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫాంపై టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని గురువారం రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాస్‌కు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ మూడో ప్లాట్‌ఫాం వద్ద టికెట్ కౌంటర్ లేకపోవడంతో వృద్ధులు, పిల్లలు, గర్భిణులు ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏఎస్ఆర్ మూర్తి, కలికోట రమణయ్య, నాగేశ్వర్‌రావు, ఎల్లాగౌడ్, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయి వసతులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌తో కలిసి సీడీపీవోలు, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మూత్రశాలల నిర్మాణాలు చేపట్టి, విద్యుత్, ఇతర అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. చిన్నారులకు అవసరమైన ఆట వస్తువులు సమకూర్చాలన్నారు. జిల్లాలోని 11 అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు సమయానుకూలంగా పౌష్టికాహారం అందించాలన్నారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించాలని సూచించారు. శామ్– మామ్ పిల్లలను గుర్తించి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. మరమ్మతులు, నిర్మాణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అందించాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

గ్రూప్స్ పరీక్షలు వాయిదా వేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్– 2, గ్రూప్– 3 పోస్టులను పెంచి పోస్టుల భర్తీ ప్రక్రియను డిసెంబర్ వరకు వాయిదా వేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చట్టబద్ధంగా పోరాడుతున్న అభ్యర్థులపై ప్రభుత్వం పోలీసుల నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. ప్రస్తుతం డీఎస్సీ రాత పరీక్ష రాస్తున్న వారిలో చాలామంది అభ్యర్థులు ఇతర పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి న్యాయం జరిగేలా గ్రూప్స్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శివ, మండల సహాయ కార్యదర్శి తిరుపతి, మండల ఉపాధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ విఠల్

కాగజ్‌నగర్‌రూరల్: ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలో మొక్కలు నాటారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించేందుకు వాతావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలోని అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఫారెస్టు సిబ్బంది అడవుల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో కూడా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, నాయకులు శ్రీనివాస్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, శంకర్, మెప్మా సిబ్బంది ఉన్నారు.

మంచం పట్టిన గుండాయిపేట

- 150 మందికి పైగా జ్వరాలు

కౌటాల(సిర్పూర్): విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గ్రామీణ ప్రజలు సీజనల్ జ్వరాల బారిన పడుతున్నారు. కౌటాల మండలం గుండాయిపేటలో వారం రోజులుగా ప్రజలు తీవ్ర జ్వరాలతో మంచం పట్టారు. బీసీ కాలనీలో 150 మందికి పైగా జ్వరం, ఒళ్లు, కీళ్లనొప్పులతో బాధపడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గ్రామంలోని డ్రెయినేజీల్లో మురుగు నిలుస్తుందని, ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేసారి ప్రజలు జ్వరం బారిన పడడంతో స్థానిక ఆర్ఎంపీలు ఇదే అదునుగా వచ్చిరాని వైద్యం చేస్తున్నారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. కాగా.. గుండాయిపేట గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సమీప గ్రామాల ప్రజలు వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జ్వరంతో బాధపడుతున్న యువకుడు

నాడు కళకళ.. నేడు వెలవెల





గతేడాది ఈ సమయానికి నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కిన తిర్యాణి మండలంలోని చింతలమాదర జలపాతం ప్రస్తుతం వరద లేక వెలవెలబోతోంది. సాధారణంగా చింతలమాదర జలపాతానికి జూన్ మూడోవారం నుంచి వరద ఉంటుంది. జూలై నుంచి పర్యాటకుల తాకిడి ఉంటుంది. ఇప్పటివరకు జలపాతం వద్ద నీటి ధార కనిపించడం లేదు. పర్యాటకులు జలపాతం వద్దకు రావొద్దని అధికారులు సూచించారు. - తిర్యాణి

20న సిడాం శంబు వర్ధంతి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జైనూర్(ఆసిఫాబాద్): ఈ నెల 20న నిర్వహించే తొలిదశ ఉద్యమకారుడు సిడాం శంబు వర్ధంతిని జయప్రదం చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావు పిలుపునిచ్చారు. జైనూర్ మండల కేంద్రంలో గురువారం వర్ధంతి కరపత్రాలు ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, సార్‌మెడీలు జుగ్నక దేవురావు, ఆత్రం ఆనంద్‌రావు, నాయకులు మడావి భీంరావు, తొడసం ధర్మారావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- 'రైతు రుణమాఫీ' లింకులకు స్పందించొద్దు
- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సైబర్ మోసాలు పెరిగిన నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకం చేపట్టిన నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్తులు ఏదో ఒక బ్యాంకు పేరిట బ్యాంక్ లోగో పెట్టుకుని వాట్సాప్‌లో ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని హెచ్చరించారు. యాక్సెప్ట్ చేస్తే వాట్సాప్ నేరగాళ్ల కంట్రోల్‌లోకి వెళ్లిపోతుందని, గూగుల్ పే, ఫోన్‌పే, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా డబ్బులు దోచేస్తారని పేర్కొన్నారు. ట్రెండింగ్‌లో ఉన్న టాపిక్ ద్వారా ఏపీకే ఫైల్స్ పంపి డబ్బులు కొట్టేస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లో వాటిని ఓపెన్ చేయొద్దని సూచించారు. వాట్సాప్ పనిచేయకుంటే వెంటనే రీస్టార్ట్ చేసి, యాప్‌లో రిపోర్ట్ చేయాలని తెలిపారు. బాధితులు నగదు కోల్పోతే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలని తెలిపారు. అలాగే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో రిపోర్ట్ చేయడం ద్వారా కోల్పోయిన డబ్బు తిరిగి పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎస్సైలు

ఇటీవల జిల్లాకు కేటాయించిన నూతన ఎస్సైలు రామకృష్ణ, నరేశ్ గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి పూలమొక్క అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పోలీసు శాఖకు గుర్తింపు తెచ్చే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

క్లుప్తంగా

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

బెజ్జూర్(సిర్పూర్): మండల కేంద్రంలోని గోల్కొండ కాలనీకి చెందిన ఓ చిన్నారిపై గురువారం కోతులు దాడి చేసి గాయపర్చాయి. పెద్దల సంతోష్ కుమార్తె స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా కోతులు దాడి చేశాయి. చిన్నారి చేతికి గాయాలయ్యాయి. కోతుల బెడద నివారించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

పటిక పట్టివేత



స్వాధీనం చేసుకున్న పటిక

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో రామగిరి రైలులో గురువారం సోదాలు నిర్వహించి నాటుసారా తయారీకి వినియోగించే పటికను పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. రైలులో తరలిస్తున్న 300 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సోదాలలో రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతల బైండోవర్



బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వేమనపల్లి: గుడుంబా విక్రేతలు ముగ్గురిని ఎక్సైజ్ సీఐ హరి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ రమేష్ ఎదుట బైండోవర్ చేశారు. మండల కేంద్రానికి చెందిన చల్ల మల్లేష్ నాలుగు క్వింటాళ్ల బెల్లం, పటిక, కేతన్‌పల్లికి చెందిన గురుండ్ల సంతోష్ గుడుంబా, నీల్వాయికి చెందిన కాటబోయిన చంద్రకళ గుడుంబాతో ఇటీవల పట్టుబడ్డారు. వీరు పద్ధతి మార్చుకోకపోవడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి పట్టుబడితే రూ.లక్ష జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించనున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలోని ఆదిలాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంస్థతోపాటు అగ్రి ఇన్‌పుట్ స్టోర్‌లో పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఈవో సుమన్ తెలిపారు. ఇంటర్‌లో సీఈసీ, డిగ్రీలో బీకాం చేసి వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పక ఉండాలన్నారు. వివరాలకు 9963104247 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సరిహద్దున హై అలర్ట్

- మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్
- 12 మంది మావోయిస్టులు మృతి
- ఉమ్మడి జిల్లా సరిహద్దులో అప్రమత్తమైన పోలీసులు



ఎన్‌కౌంటర్ జరిగిన వందోళి అటవీ ప్రాంతం

చింతలమానెపల్లి: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా వందోళి అటవీ ప్రాంతంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో హైఅలర్ట్ పరిస్థితి నెలకొంది. జూలై 28 నుంచి ఆగస్టు 3వరకు మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో కోర్చి–తిప్పగఢ్, చత్‌గావ్–కసన్‌సూర్ ఉమ్మడి దళ సభ్యులు సుమారు 12 నుంచి 15మంది గడ్చిరోలి జిల్లా వందోళి సరిహద్దులోని అటవీ ప్రాంతంలో విడిది చేసినట్లు తెలిసింది. సీ–60 కమాండో దళాలు, మవోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో 12మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో ఏడుగురు పురుషులు కాగా, ఐదుగురు మహిళలు ఉన్నట్లు గుర్తించారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో జిల్లా సరిహద్దుపై పోలీసులు నిఘా పెంచారు.

సరిహద్దు మండలాల్లో నిఘా..

సరిహద్దున జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు అప్రమత్తం అయ్యారు. సరిహద్దు మండలాల్లో నిఘా పెంచారు. కాగజ్‌నగర్ పోలీస్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల్లో సరిహద్దు ప్రాంతాలైన అహేరి, ఏటపల్లి, భామ్రాగఢ్‌కు చెందిన వారు ఉన్నారు. మహారాష్ట్ర వైపు కొంత ఆందోళనకర వాతావరణం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో గాయాలపాలైన, తప్పించుకున్న వారు తెలంగాణ వైపు వచ్చి ఉండవచ్చనే అనుమానాలను మహారాష్ట్ర పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పోలీసులు సైతం ఈ దిశగా నిఘా పెంచారు. దళాల ఆధ్వర్యంలో కూంబింగ్ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పోలీసులకు సమాచారం అందించకుండా సరిహద్దు ప్రాంతాలకు ప్రజాప్రతినిధులు వెళ్లవద్దని పోలీసు అధికారులు హెచ్చరికలు చేశారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, అహేరి ఎమ్మెల్యే ఆత్ర ధర్మారావు బాబాతో గురువారం సమావేశం కావాల్సి ఉండగా.. పోలీసు అధికారుల సూచనతో రద్దయింది.

అప్రమత్తంగా ఉన్నాం

జిల్లా పోలీసులు మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉన్నారని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో నిఘా పెంచామని పేర్కొన్నారు. ఆయా మండలాల స్టేషన్లకు సూచనలు చేశామన్నారు. కూంబింగ్ యథావిధిగా నడుస్తోందన్నారు. ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి



మొక్కలు నాటుతున్న డీడీఎంఎస్ వెంకన్న

- డీడీఎంఎస్ జీ.వెంకన్న
- శ్రీరాంపూర్ ఓసీపీ తనిఖీ

శ్రీరాంపూర్: గనుల్లో ఉద్యోగుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీడీఎంఎస్) బీ.వెంకన్న అన్నారు. ఆలిండియా మైన్స్ సేఫ్టీ అవార్డు కమిటీ చైర్మన్‌గా ఉన్న ఆయన గురువారం శ్రీరాంపూర్ ఓసీపీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్వారీ ఆవరణలో మొక్కలు నాటారు. గనిని సందర్శించి రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా నాలుగు గనులు ఆలిండియా మైన్స్ సేఫ్టీ అవార్డుకు ఎంపికయ్యాయని, ఇందులో శ్రీరాంపూర్ ఓసీపీ కూడా ఉండడం అభినందనీయమని అన్నారు. రక్షణతో పని చేసి బొగ్గు ఉత్పత్తి సాధించాలని, రక్షణ సూత్రాలను విస్మరించరాదని తెలిపారు. ఓసీపీలో ఇంజినీర్లు భారీ యంత్రాల్లో వినియోగించే ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్ అండ్ సప్రెషన్ సిస్టం పనితీరును ఆయనకు వివరించారు. గనిలో రక్షణ చర్యలను గని అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ జీఎం అనురాగ్‌శేఖర్ దూబే, హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్ జీఎం రవీంద్ర గత్వార్, యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జీఎం మనోరంజన్ మహాలి, నైవేలీ జీఎం సురేశ్‌మూర్తి, డాక్టర్ రితేశ్, శ్రీరాంపూర్ ఇంచార్జీ జీఎం ఎం.శ్రీనివాస్, ఓసీపీ పీఓ టీ.శ్రీనివాస్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, అపెక్స్ కమిటీ సభ్యులు ఏవీ రెడ్డి, గని మేనేజర్ బ్రహ్మాజీ, రక్షణాధికారి శ్రీనివాస్, ఇంజినీర్ చంద్రశేఖర్, సంక్షేమ అధికారి బీ.శంకర్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుల అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్/కాసిపేట: బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం రాజ్‌భవన్ ముట్టడికి తరలివెళ్లిన ఆ సంఘం నాయకులను హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. రాజ్‌భవన్‌కు చేరుకోకముందే అదుపులోకి తీసుకుని చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీరిలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, శ్రీరాంపూర్‌కు చెందిన యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, నాయకులు కొట్టె కిషన్‌రావు, మొత్కూరి కొమురయ్య, అఫ్రోజ్‌ఖాన్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి, వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి, బ్రాంచి అసిస్టెంట్ సెక్రెటరీ తిరుపతిగౌడ్, నాగేశ్వర్‌రావు, కాసిపేట మైన్ పిట్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, ఆఫీస్ బేరర్ రమేష్, బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ పుట్ట శ్రీనివాస్ ఉన్నారు. సీతారామయ్య మాట్లాడుతూ కేంద్రం తెలంగాణలోని బొగ్గు గనుల వేలం వేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేయడానికి వెళ్లిన తమను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నాయకుల అరెస్టును ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ ఖండించారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ దత్తారావు

భీమిని: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో చోటు చేసుకున్న అవకతవకలు సామాజిక తనిఖీ ప్రజావేదిక ద్వారా వెల్లడయ్యాయి. గురువారం కన్నెపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధిహామీ పథకం కింద రూ.1,66,28,044 విలువైన పనులు 15 గ్రామ పంచాయతీల్లో చేశారు. ఆయా పనుల్లో జరిగిన అవినీతిపై పంచాయతీల్లో రికవరీ చేశారు. మాడవెల్లిలో రూ.11,159, నాయకునిపేటలో రూ.1346, లింగాలలో రూ.5,486, మెట్‌పల్లిలో రూ.367, వీరాపూర్‌లో రూ.271, కన్నెపల్లిలో రూ.242, రెబ్బెనలో రూ.265, జజ్జరవెల్లిలో రూ.1000 జరిమానా విధించారు. మొత్తం రూ.19,364 రికవరీ, రూ.వెయ్యి జరిమానా వేశారు. సామాజిక తనిఖీ బృందాలు సరిగా తనిఖీలు చేపట్టలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ సమావేశానికి ప్రజలు ఎవరూ హాజరు కాకపోవడం గమనార్హం. ఈ సమావేశంలో ప్రిసైడింగ్ అధికారి, అడిషనల్ డీఆర్‌డీఓ దత్తారావు, డీవీఓ కిరణ్, ఎంపీడీఓ గంగామోహన్, అంబుడ్స్‌మెన్ శివరాం, ఏపీఓ శ్రీనివాస్, ఎస్‌ఆర్‌పీ రాఘవులు, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో రక్షణే ప్రథమం



అధికారులకు సూచనలు ఇస్తున్న జీఎం

మందమర్రిరూరల్: ప్రతీ ఉద్యోగికి విధి నిర్వహణలో రక్షణే ప్రథమమని ఏరియా జీఎం మనోహర్ అధికారులకు సూచించారు. గురువారం ఏరియాలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రమాదాల నివారణ, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలని, ఉద్యోగులకు ఎప్పటికప్పుడు రక్షణ సూత్రాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్వో టు జీఎం రాజేశ్వరరెడ్డి, ఏరియా డీజీఎంలు, ప్రాజెక్ట్ ఆఫీసర్స్, ఏజెంట్లు, మేనేజర్లు, పిట్ ఇంజనీర్స్, సేఫ్టీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మహారాష్ట్రకు తరలిస్తున్న ఎరువుల పట్టివేత



తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నూర్: చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా నాలుగు వాహనాల్లో తరలిస్తున్న డీఏపీ 2020 యూరియా బస్తాలను సీఐ రవీందర్ పట్టుకున్నారు. గత కొంతకాలంగా చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఎరువులు రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు గురువారం చెన్నూర్ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నాలుగు వాహనాలను తనిఖీ చేయగా 200 యూరియా బస్తాలు లభించాయి. ఎలాంటి ఆన్‌లైన్ బిల్లులు లేవు. తెల్లకాగితాలపై బస్తాల వివరాలు రాసి ఉన్నాయి. దీంతో వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ కేసును వ్యవసాయాధికారి శ్రీనివాస్‌కు అప్పగించామని సీఐ తెలిపారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ



గాయపడిన అల్లూరి అనిల్, శంకర్

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలంలోని మర్రిపల్లి స్టేజీ సమీపంలో గురువారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏనగూడ గ్రామానికి చెందిన ఎంగిలి రమేశ్, పోశాలు బైక్‌పై దహెగాం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో గిరవెల్లి గ్రామానికి చెందిన అల్లూరి అనిల్, అల్లూరి శంకర్ దహెగాం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. మర్రిపల్లి స్టేజీ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఎంగిలి రమేశ్, అల్లూరి అనిల్, అల్లూరి శంకర్ తీవ్రంగా గాయపడగా.. పోశాలుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం రమేశ్‌ను ప్రైవేట్ వాహనంలో మంచిర్యాలకు, అనిల్, శంకర్‌ను అంబులెన్సులో బెల్లంపల్లికి తరలించారు. ఏఎస్సై ఉత్తం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

శ్రేష్ఠ పథకానికి నలుగురు ఎంపిక

రామకృష్ణాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రేష్ఠ పథకానికి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రేమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తద్వార సామాజిక అభివృద్ధికి బాటలు వేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల శ్రేష్ఠ పథకానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు సింధు, భవాని, వనజ, మానసలకు ఉచిత రెసిడెన్షియల్ విద్యతోపాటు వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థినులను కళాశాల సిబ్బంది అభినందించారు.

ఎస్‌ఎఫ్ఐకి రాజీనామా

మంచిర్యాలఅర్బన్: వ్యక్తిగత కారణాల వల్ల ఎస్‌ఎఫ్ఐ బాధ్యతలకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు జిల్లా సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి తెలిపారు. రాజీనామా లేఖ పంపించినా విద్యార్థి సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేయటం సరికాదని తెలిపారు.

గిరిజనులను బెదిరించే చర్యలు మానుకోవాలి

బెల్లంపల్లి: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులను బెదిరిస్తూ అక్రమ కేసులు పెట్టే చర్యలను ప్రభుత్వ అధికారులు వెంటనే మానుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. గురువారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎమ్మెల్యే వినోద్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిని మండలం ఖర్జీ భీంపూర్ గ్రామ శివారు సర్వే నంబరు 312లో పోడు భూములను ఆదివాసీ మన్నెవార్ గిరిజనులు ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వీరికి పట్టాలు ఇవ్వకుండా అధికారులు వేధింపులకు పాల్పడుతూ అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఇంకెన్నాళ్లో..!

- అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర వసతులు
- దశాబ్దాలు గడుస్తున్నా పక్కా భవనాల ఊసే కరువు
- బెల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో అద్దె భవనాల్లో 121 కేంద్రాలు
- ఇబ్బంది పడుతున్న అంగన్‌వాడీల సిబ్బంది, గర్భిణులు, చిన్నారులు



బెల్లంపల్లి మండలం లంబాడితండాలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

బెల్లంపల్లిరూరల్: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయడంతో పాటు, గర్భిణులకు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పౌష్టికాహారం పంపిణీలో తరచూ జాప్యం ఏర్పడుతుండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగించడం లబ్ధిదారులకు మరింత ఇబ్బందికరంగా మారింది. దశాబ్దాలు గడుస్తున్నా పక్కా భవనాలు లేకపోవడంతో అరకొర వసతులతో లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు.

బెల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో...

బెల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 279అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. బెల్లంపల్లి అర్బన్, బెల్లంపల్లిరూరల్, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల్లో కలిపి మొత్తం కేవలం 73పక్కా భవనాలు మాత్రమే ఉండగా మరో 85అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానం చేశారు. 121అంగన్‌వాడీ కేంద్రాలు నేటికీ అద్దె భవనాల్లోనే అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.

పక్కా భవనాలు కరువు...

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కోసం పక్కా భవనాల ఏర్పాటు పై అధికారయంత్రాంగం ఇంకా నిర్లక్ష్య ధోరణిని వీడనట్టు కనిపిస్తోంది. ఐసీడీఎస్ వ్యవస్థ ప్రారంభమై దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ ఒక ప్రాజెక్టు పరిధిలో 121అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నూతన భవనాల కోసం అధికారులు చేస్తున్న ప్రతిపాదనలు బుట్ట దాఖలవుతుండడంతో గర్భిణులు, బాలింతలు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక అంగన్‌వాడీ టీచర్లు ఒకే గదిలో సరుకులు నిల్వ ఉంచడం, వంట చేయడం, గర్భిణులకు, చిన్నారులకు సేవలు అందించడం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అది కాక భవనాల యజమానులు ఎప్పుడు ఖాళీ చేయమంటారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల అద్దె ఎక్కువ ఇస్తామన్నా కూడా గదులు దొరికే పరిస్థితులు లేవు. దీనికి తోడు అద్దె భారం కూడా అధికంగానే ఉంది. 121భవనాలకు సరాసరిన ప్రతి నెలా రూ.3లక్షలకు పైగానే అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఇది ఒక్కింత భారమైప్పటికీ పక్కా భవనాలు లేక ఇది తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం స్పందించి పక్కా భవనాల ఏర్పాటు పై దృష్టి సారిస్తేనే మెరుగైన అంగన్‌వాడీ సేవలు అందే అవకాశం ఉంది.

అరకొర వసతుల మధ్య..

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తుండడంతో ఆ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా వరకు ఒకే గదిలో ఈ కేంద్రాలు నిర్వహిస్తుండడంతో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అనుకున్న మేర సాగడం లేదు. గర్భిణులు, బాలింతలు కూడా అందీఅందని సౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం, నీటి వసతి, ఆటస్థలం, వంటగది లాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇటు లబ్ధిదారులకు అటు అంగన్‌వాడీ టీచర్లు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పక్కా భవనాల కోసం ప్రతిపాదించాం



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల కోసం గతంలోనే ప్రతిపాదించాం. కానీ అవి ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. అద్దె భవనాల్లో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలను అందిస్తున్నాం. పక్కా భవనాల మంజూరు కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. –మాసు ఉమాదేవి, సీడీపీవో, ఐసీడీఎస్ బెల్లంపల్లి ప్రాజెక్టు

నిందితులను అరెస్టు చేయాలి

బెల్లంపల్లి: తమపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చిన నిందితులను అరెస్టు చేయించాలని బెల్లంపల్లికి చెందిన దళిత మహిళ, బాధితురాలు ఎర్ల లావణ్య కోరారు. గురువారం హైదరాబాద్‌లో దళిత బహుజన ఫ్రంట్ (బీడీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పనతో కలిసి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొనకాటి లక్ష్మీనారాయణను స్వయంగా కలిసి వినతిపత్రం అందించగా, మరో సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్‌కు ఫోన్ చేసి దాడి విషయాన్ని బాధితురాలు విన్నవించారు. బెల్లంపల్లిలో తమ ఇంటి స్థలం కబ్జా చేయడానికి సంతోష్ ఆయన తల్లిదండ్రులు మల్లేశ్వరి, రాజయ్య దూషించి దాడి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీడీఎఫ్ హైదరాబాద్ నగర నాయకుడు భ్యాగరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి.. వైద్యం అందించి..



బురదరోడ్డుపై కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం నర్సాపూర్ ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది బురద రోడ్డులో రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి రాజులగూడ గ్రామస్తులకు వైద్యం అందించారు. వివరాలు.. సిరిచెల్మ ఆరోగ్య ఉపకేంద్రం హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్‌ఎం రేణుక, ఎంఎల్‌హెచ్‌వో సంగీత, ఆశ కార్యకర్తలు గంగామణి, లక్ష్మి నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని రాజులగూడలో గురువారం వైద్యశిబిరం నిర్వహించాల్సి ఉంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు బురదమయమైంది. అయినా సిబ్బంది ఎంతో శ్రమకోర్చి రెండు కిలోమీటర్ల కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి 12 మంది రక్త నమూనాలు సేకరించారు. గర్భిణులు, బాలింతలకు రోగ నిరోధక టీకాలు వేశారు. మరో 95మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

'ఎల్లంపల్లి'కి చేరని వరద

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని ఎల్లంపల్లి జలాశయం 5 టీఎంసీల నీటి సామర్థ్యంతోనే ఉంది. ఓ వైపు మోస్తారుగా వర్షాలు కురుస్తున్నా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం అంతగా లేకపోవడంతో ప్రాజెక్ట్‌లోకి నీరు చేరడం లేదు. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్ట్ క్రస్ట్ లెవెల్ 146 మీటర్లు ఉండగా 15 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇక గురువారం ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు గాను 140.25 మీటర్లు ఉంది. మొత్తం 20.175 టీఎంసీలకు గాను 5.200 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో కింద ఎగువ ప్రాంతాల నుంచి 2,479 క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.